TEL: T/TG/ 2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..

మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్: హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 105 | ఆదివారం 08-12-2024 | పేజీలు : 5 | వెల :4/-




## బంగాళాఖాతంలో మరో వాయు'గండం'

- ఏపీకి పొంచి ఉన్న వాన ముప్ప
- దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు
- తమిళనాడు, శ్రీలంక తీరాలకు అలర్ట్
- హెచ్చరికలు జారీ చేసిన అధికారులు

## క్షమించండి మళ్లీ ఆ తప్పుచేయను: దక్షిణ కొరియా అధ్యక్షుడి ప్రకటన



**సియోల్:** 'ఎమర్జెన్సీ మార్షల్‌లా' ప్రకటనతో చిక్కుల్లో పడిన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్‌యోల్‌కు పదవీ గండం ముంచుకొస్తోంది. ఆయనపై విపక్షాలు తీసుకొచ్చిన అభిశంసన తీర్మానంపై మరికొన్ని గంటల్లో పార్లమెంట్‌లో ఓటింగ్ జరగనుంది. ఈ పరిణామాల నేపథ్యంలో యూన్ ఓ టెలివిజన్ ఛానల్‌లో మాట్లాడుతూ.. దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ తెలిపారు. ఇంకోసారి ఇలాంటి తప్పు

మిగతా 2లో

# నిరంతరం జ్వలించే ఈ మట్టి చైతన్యమే

# నాకు స్ఫూర్తి...

## - సిఎం రేవంత్

- వారసత్వాన్ని సగర్వంగా, సమున్నతంగా ముందుకు తీసుకువెళ్లే బాధ్యతను తెలంగాణ అప్పగించింది
- రాష్ట్రాన్ని అవనిపై అగ్రభాగాన నిలిపేలా కృషి చేస్తా

**హైదరాబాద్ :** పోరాటాలు, ఉద్యమాలు, త్యాగాలు, ఆత్మబలిదానాలు, ఆకాంక్షలు, ఆశయాలను కలిపి వీలునామాగా రాసి డిసెంబర్ 7, 2023వ తేదీన తెలంగాణ తన చేతుల్లో పెట్టిందని సిఎం రేవంత్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా పోస్టు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన ఎక్స్‌లో ఈ పోస్టు చేశారు. వారసత్వాన్ని సగర్వంగా, సమున్నతంగా ముందుకు తీసుకువెళ్లే బాధ్యతను రాష్ట్రం అప్పగించిందని ఆయన తెలిపారు. నిరంతరం జ్వలించే ఈ మట్టి చైతన్యమే నాకు స్ఫూర్తి అని ఆయన చెప్పారు.ఆ క్షణం నుంచి జన సేవకుడిగా, ప్రజా సంక్షేమ శ్రామికుడిగా మదిలో, విధిలో, నిర్ణయాల జడిలో, సకల జనహితమే పరమావధిగా, జాతి ఆత్మగౌరవమే ప్రాధాన్యతగా, సహచరుల సహకారంతో, జనహితుల ప్రోత్సాహంతో, విమర్శలను సహిస్తూ, విద్వేషాలను ఎదిరిస్తూ స్వేచ్ఛకు రెక్కలు తొడిగి ప్రజాస్వామ్యానికి రెడ్ కార్పెట్ పరిచి, అవనిపై అగ్రభాగాన తెలంగాణను నిలిపేందుకు కృషి చేస్తానన్నారు.



గొప్ప లక్ష్యాల వైపు నడుస్తూ 4 కోట్ల ఆశయాలను నడిపిస్తూ నిరంతరం జ్వలించే ఈ మట్టి చైతన్యమే స్ఫూర్తిగా, విరామం ఎరగక విశ్రాంతి కోరక ముందుకు సాగిపోతుంది. ఏడాది ప్రజాపాలనలో ఎంతో సంతృప్తి. సమస్త ప్రజల ఆకాంక్షలు సంపూర్ణంగా నెరవేర్చడమే నా సంప్రాప్తి అని రేవంత్ ట్వీట్ చేశారు. నల్గొండ, నకిరేకల్, మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరందించే ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ పైలాన్‌ను నల్గొండ జిల్లా నార్కెట్ పల్లి మండలం బ్రాహ్మణ వెల్లేముల వద్ద శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన బ్రాహ్మణ వెల్లేముల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లో పూజలు చేశారు. రూ.674.67 కోట్ల అంచనాతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటివరకు 469 కోట్లు ఖర్చయ్యాయి. ఈ పథకం కింద దాదాపు అన్ని ప్రధాన పనులు పూర్తయ్యాయి, కాగా బ్యాలెన్సింగ్ నెట్ వర్క్ పనులు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన

మిగతా 2లో



## క్రియేటివ్‌గా ఆలోచించండి..

## విద్యార్థులతో డిప్యూటీ సీఎం పవన్

- స్వశక్తితో చదవండి
- ఉన్నత శిఖరాలకు ఎదగండి
- లింగ వివక్ష వద్దు మీ సమస్యల్ని పరిష్కరిస్తా
- కడప విద్యార్థులకు డిప్యూటీ సీఎం హామీ

**కడప :** ప్రతి ఒక్కరూ క్రియేటివ్‌గా ఆలోచించాలని, స్వశక్తితో ఎదిగి ఉన్నత శిఖరాలకు చేరాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విద్యార్థులకు ఉద్బోధ చేశారు. 'రాయలసీమ అంటే చదువుల నేల. ఒకప్పుడు రాయలసీమలో అత్యధికంగా లైబ్రరీలు ఉండేవి. ఎంతోమంది మహానుభావులు రాయలసీమ నుంచి వచ్చారు. అలాంటి రాయలసీమకు పునర్ వైభవం రావాలి' అని అన్నారు. 2014.. -19 మధ్య ఉద్దానం సమస్యను బయటకు తీసుకొచ్చినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు రూ. 61 కోట్లతో ఉద్దానం ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. కడప ప్రాంతం నుంచి ఇద్దరు సీఎంలు అయ్యారు కనుక ఈ ప్రాంతంలో ఇక సమస్యలు తీరిపోయి ఉంటాయనుకున్నానని అయితే, కడపలో ఇంత నీటి సమస్య ఉందని అనుకోలేదని పవన్ పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సృజనాత్మకతను ప్రసంసించారు.వెనుకపడిన సెక్షన్ విద్యార్థులతో మాటామంతీ పంచుకున్నారు. కడప మున్సిపల్ కార్పోరేషన్ హైస్కూల్ లో శనివారం పేరేంట్స్ టీచర్స్ మీటింగ్ లో డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. తరగతి గదిలో విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలోకి ప్రవేశించగానే పదవ తరగతి విద్యార్థులు తయారు చేసిన రైల్వే రోప్ ఎలివేటర్ ప్రాజెక్ట్ ను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందిస్తూ.. ప్రతి ఒక్కరూ సృజనాత్మకతతో ఆలోచించాలని సూచించారు. అనంతరం తరగతి గదిలో ప్రతి విద్యార్థిని పలకరించి విద్యార్థుల ప్రావీణ్యతను అడిగి తెలుసుకున్నారు. క్లాస్ రూమ్ లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారని టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. క్లాస్ రూమ్ లో ఉన్న డిజిటల్ బోర్డును పరిశీలించారు. ప్రధానంగా రెజ్లింగ్, ఆర్చరీ, క్రికెట్ వంటి క్రీడల్లో రాష్ట్ర స్థాయి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను అభినందించారు.

**ఆటలకు సదుపాయాల్లేవు : విద్యార్థుల నిస్పృహ**

ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తెచ్చారు. ప్రాక్టీస్ చేసుకునేందుకు

మిగతా 2లో

## మహా వికాస్ అఘాడీకి మరో షాక్...

# కూటమి నుంచి ఎస్పీ ఔట్



**ముంబై:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన మహా వికాస్ అఘాడీలో పార్టీల మధ్య విభేదాలు మొదలయ్యాయి. బాబ్రీ మసీదు కూల్చివేతకు సంబంధించి శివసేన(యూబీటీ) నేత ఒకరు చేసిన వ్యాఖ్యలే దీనికి కారణం. ఆ వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డ సశమాజ్‌వాదీ పార్టీ కూటమి నుంచి వైదొలగాలని నిర్ణయించుకుంది.అసలేం జరిగిందంటే, బాబ్రీ మసీదు కూల్చివేతపై శివసేన (యూబీటీ) ఎమ్ఎల్సీ మిలింద్ సర్వేకర్ సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్ట్ చేశారు. 'ఈ పని చేసిన వారి పట్ల నేను గర్వంగా ఉన్నా' అని శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాక్రే చేసిన వ్యాఖ్యలను రాసుకొచ్చారు. అటు ఓ వార్తా పత్రిక లోనూ దీనిపై ప్రకటన ఇచ్చారు. ఈ పరిణామాలపై సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) ఆగ్రహం వ్యక్త చేసింది. "ఇలాంటి చర్యలకు పాల్పడితే బీజేపీకి వారికి తేడా ఏముంది?.. మేం ఇంకా ఎందుకు వారితో కలిసి ఉండాలి? మహా వికాస్ అఘాడీ నుంచి మేం వైదొలగుతున్నాం. ఇదే విషయాన్ని పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లాం" అని ఎస్పీ మహారాష్ట్ర చీఫ్ అబుఅజ్మీ వెల్లడించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఈ పార్టీ ఎంవీకే కూటమితో కలిసి పోటీ చేసిన సంగతి తెలిసిందే. రెండు అసెంబ్లీ స్థానాలను దక్కించుకుంది. ఎస్పీ ప్రకటనపై శివసేన (యూబీటీ) ఇంకా స్పందించలేదు.

# తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రండి.. కెసిఆర్‌కు పొన్నం ఆహ్వానం

- ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌లో కేసీఆర్‌ను కలిసిన మంత్రి పొన్నం, ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రజా సంబంధాల సలహాదారు హర్కర వేణుగోపాల్
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు కేసీఆర్‌ను ఆహ్వానించిన మంత్రి
- రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు ఆహ్వానం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆహ్వానపత్రం అందించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్:** ఈ నెల 9న సచివాలయం ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేయనున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. విగ్రహావిష్కరణకు రావాలని పలువురు ప్రముఖులకు ఆహ్వానిస్తోంది.

ఈ క్రమంలోనే బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానించారు. ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో కేసీఆర్‌ను కలిసి ఈ నెల 9న జరగనున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కోరారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు ఆహ్వానపత్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు. అలాగే గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతోపాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కూడా ఆహ్వానించారు.

**కేసీఆర్‌కు ఆహ్వానపత్రం అందజేసిన మంత్రి పొన్నం:**

ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ కలిశారు. ఆయనతో సుమారు గంట 15 నిమిషాల పాటు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ప్రజాపాలన వేడుకలకు రావాలని కేసీఆర్‌కు పొన్నం ప్రభాకర్ ఆహ్వానపత్రం అందజేశారు. ఆయనతో పాటు

మిగతా 2లో

## ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తారా.. కేటీఆర్



- రైతులు అడుక్కోరు, ఆశపడుతారు
- రైతు భరోసాకు ఎగనామం పెట్టారు
- రుణమాఫీ పేరుతో కనికట్టు చేశారు
- రైతులను రోడ్ల మీదికి లాగింది ఎవరు?
- అన్నదాతలను అవమానించేలా మాటలా మంత్రి తుమ్మల వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం

2

## తెలంగాణలో బిజెపిదే అధికారం: జెపి నడ్డా



2

# నిరంతరం జ్వలించే ఈ మట్టి చైతన్యమే నాకు స్ఫూర్తి: సీఎం రేవంత్

చర్యలు చేపట్టి మొదటి విడతలో బ్రాహ్మణ వెల్లెముల ద్వారా 50 వేల ఎకరాలకు సాగు నీరు అందించనున్నారు. నల్గొండ జిల్లా లోని నార్కెట్ పల్లి, నల్గొండ, జగిత్యాల, మునుగోడు, రామన్నపేట, కట్టంగూరు, శాలి గౌరారం మండలాలలోని లక్ష ఎకరాలు సాగవుతుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుట్ట సుఖేందర్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, నల్గొండ, భువనగిరి ఎంపిలు కుందూర్ జయవీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎంఎల్ఎలు వేముల వీరేశం, రాజగోపాల్ రెడ్డి, బాలు నాయక్, బీర్ల ఐలయ్య, మందుల శామ్యూల్, నేతి విధ్యా సాగర్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవార్, జిల్లా ప్రాజక్టుల ఈ ఎన్ సి అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. ప్రజాపరిపాలన విజయోత్సవాల్లో భాగంగా ఇవాళ నల్గొండ జిల్లాలో పర్యటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి%ౌ% జిల్లా కేంద్రంలోని జివి గూడెంలో వైద్య కళాశాల ప్రారంభోత్సవం, నర్సింగ్ కళాశాల శంకుస్థాపన చేశారు.
అనంతరం గంధంవారి గూడెంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. "తెలంగాణ ఉద్యమంలో నల్గొండ పాత్ర మరువలేదని.. ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకున్న శ్రీకాంతాచారి నల్గొండ వ్యక్తే అని స్మరించుకున్నారు.
నల్గొండలో అడుగుపెట్టినప్పుడల్లా సాయుధ పోరాటం గుర్తొస్తుందని సీఎం రేవంత్ అన్నారు. రజాకార్ల ఆగడాలకు ఎదురొడ్డి నిలిచిన జిల్లా నల్గొండ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ ఎప్పుడైనా ప్రతిపక్ష పాత్ర పోషించారా..? అని ప్రశ్నించారు. కేసీఆర్ ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. కేసీఆర్ నిర్లక్ష్యం కారణంగా నల్గొండ జిల్లా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ పూర్తి చేసి ఉంటే.. నల్గొండ జిల్లా ఫ్లోరైడ్ సమస్య పరిష్కారమయ్యేది అన్నారు. కానీ, కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల నల్గొండ వాసులకు ఎక్కువ నష్టం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ జిల్లాలో కృష్ణా జలాలు ప్రవహించేలా చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసి దేశానికే మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు.
వరి పండిస్తే ఉరే అని ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.500 బోనస్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం అని తెలిపారు.
2.70లక్షల ఎకరాల్లో సన్న వడ్లను నల్గొండ జిల్లా రైతులు పండించారని.. వరి పంటలో నల్గొండ జిల్లా నెంబర్ వన్ అని తెలిపారు. వ్యవసాయం అంటే పండుగ అనేలా తమ ప్రభుత్వం చేస్తోంది" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# క్రియేటివ్‌గా ఆలోచించండి.. విద్యార్థులతో డిప్యూటీ సీఎం పవన్

సరైన క్రీడా పరికరాలు, వసతులు లేవని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా బాలికలకు సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదని చెప్పారు. శిక్షణ క్యాంపులు కూడా నిర్వహించడం లేదన్నారు. దీనిపై స్పందించిన పవన్ ఎందుకలా జరుగుతోంది ?, బాలురు, బాలికలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలి కదా? అంటూ ప్రశ్నించారు. మీ సమస్యలను పరిష్కరిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. అందరూ బాగా చదవాలని స్వసక్తితో ఎదిగి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.

**ప్రతి విద్యార్థికి ఆత్మీయ పలకరింపు...**

అనంతరం పింగళి వెంకయ్య బ్లాక్ 8వ తరగతి డి సెక్షన్ నందు విద్యార్థులతో మాట్లాడారు. అక్కడి నుంచి మహాత్మా గాంధీ బ్లాకు ఆరవ తరగతి సి సెక్షన్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ప్రతి బెంచ్ దగ్గరికి వెళ్లి ఆప్యాయంగా విద్యార్థుల పేర్లు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కరచాలనం చేశారు. చంద్రిక అనే విద్యార్థి వేసిన పవన్ కళ్యాణ్ పెన్సిల్ ఆర్ట్ ను ఆయనకు అందజేయగా, దానిపై సంతకం చేసి విద్యార్థికి ఇచ్చారు.
అయితే విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సైతం పవన్ ను చూసిన ఉత్సాహంతో ఆయన ఆటోగ్రాఫ్ తీసుకునేందుకు ఎగబడ్డారు. అదేవిధంగా తరగతి గది బయట నుంచి జై పవన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు, కేకలు వినిపించడంతో ఆయన తరగతి గదిలో కూర్చోలేక బయటకు వెళ్లారు.
అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల తల్లిదండ్రులు వేసిన రంగోలి ముగ్గులను ఆయన పరిశీలించి వారితో సెల్ఫీలు దిగారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్ బోర్డు నందు సంతకం చేశారు.

**ఉద్యోగ భద్రత కల్పించండి.. డిప్యూటీ సీఎంకు వినతి..**

20 ఏళ్లుగా పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్, మండల్ ఇన్ఫర్మేషన్ సిస్టం కోఆర్డినేటర్ లుగా పనిచేస్తున్నామని మాకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు.
ఆ మేరకు సీఎం పవన్ కు వినతి పత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఆయన పవన్ పరిశీలిస్తామని, తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా పోలీస్ శాఖ రూపొందించిన డ్రగ్స్ రహిత సమాజం కోసం అనే వాల్ పోస్టర్లను పవన్ ఆవిష్కరించారు.

**ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం !**

మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్ లో పాల్గొనేందుకు కడపకు వచ్చిన డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ కు ఘన స్వాగతం లభించింది. శనివారం ఉదయం హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరిన ఆయన ఉదయం 11.00 గంటలకు కడప విమానాశ్రయంకు చేరుకున్నారు.
ఈ సందర్భంగా ఆయనకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు.

# తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రండి.. కెసిఆర్‌కు పొన్నం ఆహ్వానం

ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రజా సంబంధాల సలహాదారు హర్కర వేణుగోపాల్ , ప్రోటోకాల్ డైరెక్టర్ వెంకట్ రావు ఉన్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం కోసం మాజీ సీఎం కేసీఆర్‌ను తెలంగాణ ప్రభుత్వం తరపున తాను, ప్రోటోకాల్ అధికారం కలిశామని, తెలంగాణలో అందరినీ గౌరవించాలనేది మా పార్టీ తీసుకున్న నిర్ణయమని పొన్నం ప్రభాకర్ తెలిపారు. లంచ్ టైంలో వచ్చాము కనుక కేసీఆర్ లంచ్ చేయమంటే చేశామని, తమ భేటీలో ఎటువంటి రాజకీయ అంశాలు చర్చకు రాలేదన్నారు. తాము అందరినీ ఆహ్వానిస్తున్నామని, కేసీఆర్ వస్తారా? రారా అన్న నిర్ణయం పార్టీలో చర్చించి తీసుకుంటారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని ఆహ్వానించిన మంత్రి పొన్నం :**

మరోవైపు కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ కలిశారు. రాజ్ భవన్ దిల్‌కుశా గెస్ట్‌హౌస్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన పొన్నం ప్రభాకర్ ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి కూడా రావాలని కిషన్‌రెడ్డికి మంత్రి పొన్నం ఆహ్వానపత్రికను అందచేశారు.

**రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు ఆహ్వానం :**

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మని కలిసి ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో పాల్గొనాలని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రజా సంబంధాల సలహాదారు హర్కర వేణుగోపాల్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ప్రోటోకాల్ అధికారి వెంకట్ రావు, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి ఆహ్వానించారు.

# తెలంగాణలో బిజెపిదే అధికారం: జెపి నడ్డా

- తెలంగాణలో బిజెపిదే అధికారం - కాంగ్రెస్ అబద్దపు హామీలతో ప్రజలు విసిగిపోయారు
- బిజెపితోనే తెలంగాణ సంపూర్ణాభివృద్ధి సాధ్యం
- రేవంత్ సర్కార్‌పై నిప్పులు చెరిగిన బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డా
- '6 అబద్దాలు, 66 మోసాల' సభలో నడ్డా సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బిజెపి) అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి దక్కిన ప్రజాదరణే ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఇక కాంగ్రెస్ ఏడాది పాలనపై ప్రజలు విసిగిపోయారని, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 6 అబద్దాలు, 66 మోసాలు పేరుపై రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ స్టేడియంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని జెపి నడ్డా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అబద్దాలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిగా నిర్వహిస్తున్న పాలనను ప్రజల ముందు ఎండగట్టేందుకు తాను వచ్చానని అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓట్ షేర్ చాలా తక్కువ వచ్చిందని, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని అని స్పష్టం చేశారు. కేంద్రంలో విపక్షాలన్నీ ఏకమైనప్పటికీ మూడోసారి మోడీనే గెలిపించారని తెలిపారు. 70 ఏళ్లుగా ప్రభుత్వ వ్యతిరేకత అనే పదం వింటూ వచ్చాం, కానీ మోడీ పాలనలో ఇంతవరకు ఆ మాట రాలేదని చెప్పారు.

**19 రాష్ట్రాల్లో బిజెపిదే అధికారం..**

పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ ఓట్ల శాతం భారీగా పెరిగిందన్న నడ్డా 13 రాష్ట్రాల్లో సంపూర్ణ మెజారిటీతో అధికారంలో ఉందని, మరో 6 రాష్ట్రాల్లో ఎన్డీఏ అధికారంలో ఉందని, దేశ వ్యాప్తంగా మొత్తం 19 రాష్ట్రాల్లో బీజేపీదే అధికారమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక పరాన్న జీవి అని, ఇతర పార్టీల బలహీనతలే కాంగ్రెస్ బలం అని ఘాటుగా విమర్శలు చేశారు. అంతేగాక బీజేపీతో నేరుగా పోటీలో ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎప్పుడూ ఓటమి చెందిందని, ప్రాంతీయ పార్టీల సహకారంతోనే కాంగ్రెస్ గెలుస్తూ ఉంటుందన్న విషయాన్ని రేవంత్ గుర్తు పెట్టుకోవాలని సూచించారు.
తెలంగాణ, హిమాచల్, కర్నాటక రాష్ట్రాల్లో అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని నడ్డా దుయ్యబట్టారు. ఇక రేవంత్ ప్రభుత్వం ఏడాదిగా పేదలను మోసం చేస్తునే ఉందని, ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న రూ.12 వేలు ఏమయ్యాయని, రుణమాఫీ చేయకుండానే రైతులను మోసం చేసిందని రేవంత్ సర్కార్‌ను దుయ్యబట్టారు. తెలంగాణ బీజేపీ రైతులు, మహిళలు, యువకులు, కార్మికుల సమస్యలపై పోరాటం చేయాలని నిర్ణయించిందని నడ్డా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అన్యాయం, అబద్ధాలను ప్రజలకు తెలియజెప్పేందుకు తెలంగాణ బీజేపీ నడుం బిగించిందని, ఇందుకు తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, బీజేపీ నేతలు చేస్తున్న ఈ ప్రయత్నంపై హర్షం వ్యక్తం చేశారు.

బిజెపితోనే తెలంగాణ సంపూర్ణాభివృద్ధి

తెలంగాణ సంపూర్ణాభివృద్ధి, మంచి భవిష్యత్తు బీజేపీతోనే సాధ్యమని భరోసా ఇచ్చారు. ఒక్కసారి రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇక పర్మినెంట్ గా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తెలంగాణలోనూ కమలాన్ని వికసింప చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాజస్థాన్‌లో ఆరు, గోవా 3, మధ్యప్రదేశ్ లో 3, యూపీలో రెండోసారి బీజేపీ ప్రభుత్వం వచ్చిందన్నారు. మహారాష్ట్రలోనూ మూడోసారి అధికారంలోకి వచ్చామని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లో రెండు, మణిపూర్‌లో మూడు, అసోంలో రెండు, హరియాణాలో మూడోసారి అధికారంలోకి వచ్చామన్నారు. ఒక్కసారి కాదు ఎన్నోసార్లు గెలుపు రికార్డులు బిజెపికి ఉన్నాయని అన్నారు. జమ్మూకశ్మీర్‌లో అత్యధిక స్థానాలను బీజేపీ కైవసం చేసుకుందన్నారు. ఉప ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధించిందన్నారు.
చత్తీస్‌ఘఢ్, మధ్యప్రదేశ్, గుజరాత్‌లో 64 సీట్లపై బీజేపీ కాంగ్రెస్ మధ్య ముఖాముఖి పోటీ జరగ్గా ఇందులో 62 స్థానాలను బీజేపీ గెలిచిందని అన్నారు. తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లో హామీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలం కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లో హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని అన్నారు. ఇక తెలంగాణలోనూ రూ.12 వేలు ప్రతి ఆటోడ్రైవర్‌కు ఇస్తామని మోసం చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాయమాటలు చెప్పే మాయలోళ్లని జెపి నడ్డా వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి కూడా మాయమాటలు చెప్పేవాడేనని తెలిపారు. తెలంగాణలో విద్యాభరోసా కార్డు హామీ ఇచ్చారని, ఆ భరోసా ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిరుద్యోగులకు భృతి దొరకలేదన్నారు. రైతులకు రూ.15 వేలు ఏమైందని ప్రశ్నించారు. కౌలు రైతులకు రూ.12 వేలు అందిందా? అని సభలో బిజెపి జాతీయ అధ్యక్షుడు ప్రశ్నించారు. అందుకే వీరిని తాను మాయలోళ్లని అంటున్నానని ఎద్దేవా చేశారు.
మహిళలకు రూ.2500 ప్రతీనెలా ఇస్తామని అన్నారని ఎవ్వరికైనా లభించిందా? అని ప్రశ్నించారు. షాదీ ముబారక్ ఒక తులం బంగారం, ఒక లక్ష రూపాయల నగదు ఎక్కడని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. అప్పులు చేసి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని విమర్శించిన నడ్డా అప్పులు చేస్తూ మనుగడ సాగించే ప్రభుత్వాలు ఎక్కువకాలం మనుగడ సాగించలేవని పేర్కొన్నారు. మోదీ నేతృత్వంలో మూడో ఆర్థిక దిశగా వెళుతున్నామన్నారు. తెలంగాణకు ప్రధాని నరేంద్ర మోదీ అత్యంత ప్రాధాన్యతనిచ్చారన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ తో అందరికీ న్యాయం చేశారన్నారు. తెలంగాణకు 1.60 లక్షల కోట్లు, గ్రాంట్ 1.12 లక్షల కోట్లు, వరంగల్ కు రూ.27 కోట్లు, టెక్స్ టైల్, రైల్వేకు 20 రెట్లు బడ్జెట్, వందేభారత్ మూడు వందేభారత్, ఐదు భారత్ మాలా ప్రాజెక్టు కింద హైదరాబాద్ ఇండోర్, సూరత్ చెన్నై, హైదరాబాద్ విశాఖపట్నం లాంటి జాతీయ రహదారులు, బీబీనగర్‌లోనూ ఎయిమ్స్ నిర్మాణం లాంటి ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ బీజేపీ కాంగ్రెస్ ప్రభుత్వ అవాస్తవాలపై చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ముందుకు నడిపించాలని జేపీ నడ్డా పిలుపునిచ్చారు.

**కెసిఆర్ పాలనకు రేవంత్ సర్కార్ కొనసాగిపులా ఉంది**

రాష్ట్రంలో కెసిఆర్ పాలన ముగిసిపోయిందని ప్రజలు అనుకుంటున్న తరుణంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కెసిఆర్ పాలనను కొనసాగిస్తున్నట్లుగా ఉందని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏ లక్ష్యం కోసం అయితే ఏర్పడిందో ఆ లక్ష్యం ఇంకా నెరవేరలేదని అన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు ఒక్కటేనని విమర్శించిన కిషన్‌రెడ్డి కెసిఆర్, రేవంత్ రెడ్డి డీఎన్ఏ కూడా ఒక్కటే అంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, అందులో ఉచిత బస్సు ప్రయాణం మినహా ఏ ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. సంవత్సరం గడుస్తున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెబుతూ కాలం వెళ్లదీస్తుందని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

**అర్బన్ నక్సల్స్ చేతిలో రేవంత్ సర్కార్ బందీ...**

అర్బన్ నక్సల్స్ చేతిలో రేవంత్ రెడ్డి సర్కార్ బందీగా మారిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్ లో మాదిరిగా భాగ్యనగర్‌లోనూ హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. పరిస్థితి ఇట్లానే ఉంటే భాగ్యనగర్ మరో బంగ్లాదేశ్ గా మార్చే కుట్రలకు తెరదీశారని వ్యాఖ్యానించారు. 'భాగ్యనగర్ ప్రజలారా%ౌ% స్వామి వివేకానంద, బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, కొమరం భీం, సేవాలాల్ మహారాజ్ లా మారతారా? లేక నక్సలైట్లుగా మారతారా? ఆలోచించండి"అని కోరారు. రేవంత్ రెడ్డి వాడుతున్న భాష, ఆడుతున్న అబద్దాలను చూసి తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలెవరూ ఆయనను సీఎంగా గుర్తించడం లేదన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ కూ మూడో స్థానం తథ్యమన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎగిరేది కాషాయ జెండాయేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ వేదిక సాక్షిగా తాము అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
ఇంకా 22 లక్షల మంది రైతులకు రుణమాఫీ అమలు చేయనిది నిజమా?, కాదా? వ్యవసాయ మంత్రే ఇది నిజమని ఒప్పుకున్నది వాస్తవం కాదా?, రైతులకు ఎకరాకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తామని ఎగ్గొట్టింది నిజం కాదా? అని ప్రశ్నించారు. తాలు, తరుగు, తేమతో పనిలేకుండా వడ్లు కొంటామని మాట ఇచ్చి తప్పింది నిజం కాదా? బోనస్ పేరుతో రైతులను వంచించింది మీరు కాదా? అని బండి సంజయ్ ప్రశ్నల వర్షం కురిపించారు. యూత్ డిక్లరేషన్ పేరుతో 2 లక్షల ఉద్యోగాలను ఏడాదిలో భర్తీ చేస్తామన్నారు, మహిళలకు తులం బంగారం, స్కూటీ ఇస్తామని ఇచ్చిన వాగ్ధానాలు ఎంత వరకు అమలు చేశారని ప్రశ్నించారు. మాజీ సర్పంచులను అరిగోస పెడుతున్నారని, పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా రోడ్డున పడేసింది వాస్తవం కాదా?, మాజీ సర్పంచుల బతుకులను నాశనం చేయడానికి ప్రధాన కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలేనని బండి సంజయ్ ఆరోపించారు. త్వరలోనే జీహెచ్ఎంసీ ఎన్నికలు రాబోతున్నయ్, ఎట్టి పరిస్థితుల్లో హైదరాబాద్ గడ్డపై కాషాయ జెండాను రెపరెపలాడించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీకి 48 సీట్లు ఇచ్చారని, ఈసారి మేయర్ పీఠం బీజేపీదేనని ఆయన ప్రకటించారు.

**రేవంత్ అబద్ధాల పుట్ట**

కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై భారతీయ జనతా పార్టీ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రేవంత్ అబద్ధాల పుట్ట అని వ్యాఖ్యానించారు. రేవంత్ అబద్దాలు ప్రత్యేకంగా చెప్పక్కర్లేదని, ఆయన ఇచ్చిన హామీలు ఏమోగానీ చల్లగా బ్రతకనివ్వండి చాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బిల్లులు రాక 50 మంది వరకు సర్పంచ్‌లు చనిపోయారని, 50 ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టు రూ.12 వేలు దేవుడెరుగు మావాళ్ళు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆటో డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారని అన్నారు.
హైడ్రా పేరిట డ్రామా చేశారన్న ఈటల రాజేందర్ ఎప్పుడు బుల్డోజర్లు వస్తాయా అని కంటిమీద కునుకులేకుండా మూసి పక్కన ఉన్నవారు బ్రతుకుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారికి బీజేపీ అండగా నిలిచిందని, ధైర్యం ఇచ్చి కాపాడుకుందని అన్నారు. హైడ్రా, మూసి, లగచర్ల అయిపోయింది ఇప్పుడు ఫోర్త్ సిటీ పేరుతో పేదల, దళితుల భూములు లాక్కొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని దుయ్యబట్టారు. రేవంత్‌కి హామీలు అమలు చేసే దమ్ము లేదని అన్నారు. ఈ సభలో బిజెపి ఎంపిలు డికె అరుణ, రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర, జాతీయ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో మరో వాయు'గండం'

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌కు మరో ముప్పు పొంచి ఉంది. హిందూ మహా సముద్రంతో పాటు దానికి ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరోసారి ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో దక్షిణ బంగాళాఖాతంలో శనివారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ ఈ నెల 12వ తేదీలోపు తమిళనాడు, శ్రీలంక తీరాలకు చేరువవుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో ఈనెల 12వ తేదీన దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని అధికారులు తెలిపారు. అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. అల్పపీడనం ఏర్పడిన తర్వాతే దానిపై స్పష్టత వస్తుందని అంటున్నారు.

# క్షమించండి మళ్లీ ఆ తప్పుచేయను: దక్షిణ కొరియా అధ్యక్షుడి ప్రకటన

చేయనని వెల్లడించారు."ఆ ప్రకటన కోసం నా రాజకీయ, చట్టపరమైన బాధ్యతను తప్పించుకోలేను. మార్షల్ లా కారణంగా ప్రజలను ఆందోళనకు, తీవ్ర అసౌకర్యానికి గురి చేసినందుకు గాను క్షమాపణలు తెలియజేస్తున్నా. ఇంకోసారి ఎమర్జెన్సీ విధించే ప్రయత్నం చేయబోనని హామీ ఇస్తున్నా" అని అధ్యక్షుడు యూన్ వెల్లడించారు. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ, యూన్ సుక్ యోల్ ఇటీవల ఎమర్జెన్సీ మార్షల్ లా విధించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో పార్లమెంట్‌లో ఓటింగ్ పెట్టి అత్యవసర స్థితికి వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించారు. గంటల వ్యవధిలోనే ఎమర్జెన్సీని ఎత్తివేశారు. చేసేదేం లేక వెనక్కి తగ్గిన అధ్యక్షుడు తన ప్రకటనను విరమించుకున్నట్టు తెలిపారు.
ఈ పరిణామాలతో దేశ వ్యాప్తంగా ఆయనకు వ్యతిరేకత ఎదురైంది. అధ్యక్షుడు పదవి నుంచి దిగిపోవాలని, పట్టుబట్టిన విపక్షాలు పార్లమెంట్‌లో ఆయనపై అభిశంసన తీర్మానం తీసుకొచ్చారు. అటు సొంత పార్టీ నుంచి కూడా ఆయనకు మద్దతు కరువైంది. దక్షిణ కొరియా పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశమై అభిశంసన తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనుంది. దీని నుంచి గట్టెక్కాలంటే 300 మంది సభ్యులు ఉన్న దేశ పార్లమెంట్‌లో 200 మంది యూన్‌కు అనుకూలంగా ఓటెయ్యాలి. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ, ఇతర చిన్న విపక్ష పార్టీలంతా కలిపి 192 మంది ఉన్నారు. ఇటీవల అధ్యక్షుడి ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తీసుకొచ్చిన తీర్మానం 1900తో నెగ్గింది.

# ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తారా.. కేటీఆర్

**హైదరాబాద్ :** డబ్బులు వచ్చే వ్యవసాయం చేయాలే తప్ప.. అడుక్కుతినే బతుకు వద్దని రైతులను ఉద్దేశించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి, రైతును రహదారులపైకి లాగిన మీరా రైతుల గురించి మాట్లాడేదని మండిపడ్డారు. రైతుభరోసాకు ఎగనామం పెట్టి, రుణమాఫీ పేరుతో కనికట్టు చేసిన మీరా రైతుల గురించి మాట్లాడేదంటూ ధ్వజమెత్తారు. రైతులు ఎప్పుడూ ఆశపడతారు తప్ప అడుక్కోరని అన్నారు. వారికి సమయం రాకపోదని, మీకు తగిన గుణపాఠం చెప్పకపోరని ఎక్స్ వేదికగా శనివారం విమర్శించారు.

**భ్రమలు కల్పించి మోసం చేశారు..**

'రైతే రాజు నినాదం కాదు కేసీఆర్ ప్రభుత్వ విధానం. అడగకుండా నే రైతుబంధు.. అడగకుండానే రైతుబీమా.. అడగకుండానే సాగు నీళ్లు.. అడగకుండానే ఉచితంగా 24 గంటల కరంటు.. అడగకుండానే 100 శాతం పంటల కొనుగోళ్లు. దశాబ్దాల కాంగ్రెస్ పాలనతో వ్యవసాయ రంగం వెన్నువిరిగి, బతుకుదెరువు కోసం వలసబాట పట్టిన అన్నదాతలలో ఆత్మవిశ్వాసం నింపి వ్యవసాయం దండగ కాదు పండగ అని చాటిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది.
కరోనా విపత్తులోనూ కర్షకులకు బాసటగా నిలిచిన చరిత్ర కేసీఆర్ గారిది. ప్రతి ఊరికీ వెళ్లి పంటలు కొనుగోలు చేసిన ఘనత కేసీఆర్ గారిది.

**- రైతుబంధును రాజకీయం చేశారు..**

రైతుబంధును రాజకీయం చేసి, రైతుభరోసా అంటూ భ్రమలు కల్పించి, రైతుభీమాను మాయం చేసి, 24గంటల ఉచిత విద్యుత్తును ప్రశ్నార్థకం చేసి.. పంటల కొనుగోళ్లకు పాతరవేసి సాగునీళ్లను సాగనంపి.. అన్నదాతల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి రైతును రహదారుల పైకి లాగిన మీరా.. రైతుల గురించి మాట్లాడేది! రైతుభరోసాకు ఎగనామం పెట్టి, రుణమాఫీ పేరుతో కనికట్టు చేసిన మీరా.. రైతుల గురించి మాట్లాడేది!

**అబద్ధాల హామీల చరిత్ర మీది..**

ఇల్లిల్లూ తిరిగి అబద్ధపు హామీలు ఇచ్చి నాడు ఓట్లు అడుక్కున్న చరిత్ర మీది. అధికారం దక్కాక ఇల్లిల్లూ తిరిగి ఎమ్మెల్యేలను అడుక్కుని, కొనుక్కున్న చరిత్ర మీది. రైతులు ఎప్పుడూ.. ఆశపడతారు తప్ప అడుక్కోరు. సమయం రాక పోదు, మీకు గుణపాఠం చెప్పక పోరు. జాగో తెలంగాణ జాగో' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# థైరాయిడ్ సమస్యలు పోయి రోగ నిరోధక శక్తి పెరగాలంటే వీటిని తినాలి..!




మనం ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని రకాల పోషకాలు కలిగిన ఆహారాలను తినాలనే విషయం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలోనే మనం రోజూ అన్ని పోషకాలు ఉన్న ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఆరోగ్యంగా ఉంటారు. అలాగే అనేక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. పోషకాహార లోపం తలెత్తకుండా ఉంటుంది. మనం ఆరోగ్యంగా ఉండాలంటే పలు మినరల్స్ అవసరం అవుతాయి. వాటిల్లో సెలీనియం కూడా ఒకటి. ఇది అనేక జీవక్రియలను నిర్వర్తిస్తుంది. సెలీనియం ఉన్న ఆహారాలను తరచూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. సెలీనియం వల్ల మన శరీరానికి ఏం జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.

**పప్పు దినుసులు..** మన శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే రోగాలు రాకుండా రక్షణ వ్యవస్థ నిరంతరాయంగా పనిచేయాలి. అయితే ఇలా రోగ నిరోధక వ్యవస్థ పనిచేసేందుకు గాను సెలీనియం ఎంతగానో దోహదపడుతుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మార్చి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతోపాటు థైరాయిడ్ పనితీరు మెరుగు పడుతుంది. అలాగే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌లా కూడా సెలీనియం పనిచేస్తుంది.
అందువల్ల సెలీనియం అధికంగా ఉండే ఆహారాలను తరచూ తీసుకోవాలి. సెలీనియం మనకు ఎక్కువగా పప్పు దినుసుల్లో, చిక్కుడు జాతి గింజల్లో లభిస్తుంది. ముఖ్యంగా పప్పు దినుసులతోపాటు శనగలు, రాజ్మాను తినాలి. వీటిల్లో కేవలం సెలీనియం మాత్రమే కాదు ఫైబర్ కూడా సమృద్ధిగానే ఉంటుంది. ఇది మనల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

**చేపలు..** చేపల్లో సెలీనియం సమృద్ధిగా ఉంటుంది. కనుక వారంలో కనీసం 2 సార్లు అయినా సరే చేపలను తినాలి. ముఖ్యంగా సముద్రపు చేపలు, రొయ్యలు, పీతలు, ఆల్చిప్పలలో సెలీనియం సమృద్ధిగా ఉంటుంది. అలాగే వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. గుండె పనితీరును మెరుగు పరుస్తాయి. అనేక రోగాల బారి నుంచి మనల్ని రక్షిస్తాయి. కోడిగుడ్డులోని పచ్చ సొనలోనూ సెలీనియం సమృద్ధిగా ఉంటుంది. అందువల్ల సెలీనియం కోసం కోడిగుడ్లను కూడా తినవచ్చు.

**పొద్దు తిరుగుడు విత్తనాలు..** పొద్దు తిరుగుడు విత్తనాలను అధికంగా తీసుకోవడం వల్ల కూడా మనకు సెలీనియం లభిస్తుంది. వీటిల్లో విటమిన్ ఇ కూడా ఉంటుంది. అలాగే ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. వీటిని సాయంత్రం సమయంలో స్నాక్స్ రూపంలో తింటే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. బ్రౌన్ రైస్, ఓట్ మీల్, హోల్ వీట్ బ్రెడ్ వంటి వాటిల్లో సెలీనియం ఉంటుంది. అందువల్ల వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే సెలీనియం పొందవచ్చు. ఇవి మనకు చక్కని పోషణను అందిస్తాయి. చికెన్, మటన్ వంటి ఆహారాలను తీసుకోవడం వల్ల కూడా సెలీనియం లభిస్తుంది. వీటితో మనకు ప్రోటీన్లు కూడా లభిస్తాయి. కనుక ఆరోగ్యంగా ఉంటాము. శక్తి లభిస్తుంది. ఇలా పలు రకాల ఆహారాలను తరచూ తింటే సెలీనియం పొందవచ్చు. దీంతో అనేక వ్యాధుల నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చు. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

మన వెలుగు
MANA VELUGU TELUGU DAILY
ఆదివారం 08 డిసెంబర్ 2024

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**మెట్ పల్లి (మన వెలుగు) డిసెంబర్ 07 :**మల్లాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం లో మల్లాపూర్ మండలానికి సంబంధించిన 3,945,500 ముప్పై తొమ్మిది లక్షల నలపై ఐదువేల ఐదు వందల రూపాయల విలువ గల 93 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అనంతరం మెట్ పల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో మెట్ పల్లి పట్టణ మరియు మెట్ పల్లి మండలానికి సంబంధించిన 5,617,500/- యాబై ఆరు లక్షల పదిహేడు వేల ఐదు వందల రూపాయల విలువ గల 151 సీఎంఆర్ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శనివారం అందజేశారు.

## మానవత్వం చాటుకున్న మారుతి, కిరణ్ లు




**మెట్ పల్లి (మన వెలుగు) డిసెంబర్ 07 :**మానవత్వం చాటుకున్నారు మారుతి, కిరణ్ లు..వివరాల్లోకి వెళితే...జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ నుండి మార్కెట్ వెళ్లే దారిలో చావిడికి సామ మారుతి షాపు ముందు మూడు లక్షలు పడి ఉండటాన్ని గమనించిన మారుతి, కిరణ్ లు ఆ మూడు లక్షల రూపాయలను శనివారం సిఐ నిరంజన్ రెడ్డికి అప్పగించారు. ఈ సందర్భంగా సిఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... ఆ డబ్బులు పోగొట్టుకున్న వారు సరైన ఆధారాలను చూపించి పోలీస్ స్టేషన్ కు వచ్చి డబ్బులు తీసుకెళ్లాలని సీఐ ఏ.నిరంజన్ రెడ్డి తెలిపారు.దీనితో సామ మారుతి, కిరణ్ ను సిఐ నిరంజన్ రెడ్డి అభినందించారు.

## పాదయాత్రగా శబరిమల యాత్ర పూర్తి చేసుకున్న స్వామికి సన్మానం



**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్ 07 :**కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శబరిమలై సన్నిధానానికి మహారాష్ట్రలోని చిక్కిలి గ్రామానికి చెందిన పాండు స్వామి పాదయాత్రగా వెళ్లి తిరిగి వచ్చిన సందర్భంగా శనివారం బైంసా పట్టణ కేంద్రంలోని కాలనీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. గత 41 రోజుల క్రితం పాదయాత్ర ప్రారంభించి దాదాపు 1600 కిలోమీటర్లు పాదయాత్ర నడిచి వెళ్లి అయ్యప్పను దర్శించుకున్నారు. పాదయాత్రను విజయవంతంగా ముగించుకొని భైంసాకు వచ్చిన సందర్భంగా కాలనీ సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు మోహన్, కాలనీ అయ్యప్ప సన్నిధానం గురుస్వామి మెంచు శివాజీ, సందీప్ పటేల్, సాయిబాబా, పాంచాల్ నరేష్, కొత్తూరు వారి రాజేష్, కురువల్ల సాయినాథ్, తిమ్మాపూర్ విశాల్ రావు, స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

### - ఈజీఎస్ ఏపీవో శిరీష



**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్ 07 :**జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ముధోల్ ఏపీఓ శిరీష అన్నారు. మండల కేంద్రమైన ముధోల్ లోని గ్రామపం చాయతీ కార్యాలయ ఆవరణలో గల ఉపాధి నర్సరీని ఆమె పరిశీలించారు. మాట్లాడు రైతుల అవసరానికి తగ్గట్టుగా టేకుతోపాటు ఇతర పండ్ల మొక్కలను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకంలో నాటిన మొక్కల సౌరక్షణకు ట్రి గార్డ్ లను ఏర్పాటు చేయడంతో పాటు పిచ్చి మొక్కలను తొలగిం చడం జరిగిందన్నారు. ఉపాధి పథకంలో పని అవసరమైన ప్రతి ఒక్కరికి పని కల్పించడం జరుగుతుందని వెల్లడించా రు. గ్రామల్లో ఇప్పటికే గ్రామ సభలను నిర్వహించి పనులను గుర్తించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవో ప్రసాద్, బిజెపి మండల అధ్యక్షుడు కోరి పోతన్న, తదితరులు ఉన్నారు.

## వ్యవసాయ బావిలో దూకి వివాహిత ఆత్మహత్య



**మెట్ పల్లి (మన వెలుగు) డిసెంబర్ 07 :**మెట్ పల్లి డివిజన్ పరిధిలోని ఇబ్రహీంపట్నం మండలంలోని గోధూర్ గ్రామానికి చెందిన తెలుకంటి శ్యామల (50) అనే వివాహిత గత పది సంవత్సరాలుగా మానసిక స్థితి బాగా లేకపోవడంతో పలు హాస్పిటల్స్ లో చూపించిన ఆరోగ్యం మెరుగుపడడం లేదని మానసికంగా కృంగిపోయిన శ్యామల శనివారం ఉదయం తన సొంత వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని శ్యామల భర్త నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీం పట్నం ఎస్ఐ అనిల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జగిత్యాలకు జవహర్ నవోదయ స్కూల్ ప్రకటించిన నరేంద్ర మోడీ



## నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపిన శ్రావణి

**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 07 :**నిజామాబాద్ పార్లమెంట్ నిజమాబాద్ కు మరియు జగిత్యాలకు జవహర్ నవోదయ స్కూల్ ప్రకటించిన సందర్భంగా జగిత్యాల నియోజకవర్గం రాయికల్ పట్టణంలోని స్థానిక అంగడి బజార్ లో రాయికల్ పట్టణ మరియు మండల శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మరియు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కి, దానికి కృషిచేసిన నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం వారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షులు కల్లెడ ధర్మపురి, రాయికల్ మండల అధ్యక్షులు అన్నవేని వేణు,పిఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, మంగళారపు లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీలు ఆకుల మహేష్, రాజనాల మధు, శ్రీకాంత్ రెడ్డి, సామల సతీష్, బన్న సంజీవ్, కురుమ మల్లారెడ్డి, మరియు పట్టణ మరియు మండల పదాధికారులు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అహల్యబాయి హెూల్కర్ పుస్తక కరపత్రాలు ఆవిష్కరణ

**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్ 07 :**అహల్య బాయి హెూల్కర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాల సందర్భంగా ముధోల్లోని రభింద్ర ఉన్నత పాఠశాలలో అహల్యబాయి హెూల్కర్ పుస్తక- కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అప్పాల ప్రసాద్ చేతుల మీదుగా పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ అహల్య బాయి హెూల్కర్ 300 సంవత్సరాల క్రితమే మహిళల సాధికారిత కోసం ఆలోచించారని, సాంఘిక దురాచారాల మీద గళం విప్పి తన రాజ్యంలో వాటికి స్థానం లేకుండా శాసనాలు తెచ్చారని తెలిపారు. భారతదేశంలో ఏ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం దర్శించినా వారి ధర్మసత్రాలు దర్శనమిస్తాయని ఆయన చెప్పారు. అదేవిధంగా మొగలుల దాడిలో ధ్వంసమైన కాశీ, అయోధ్య- సోమనాథ్ లాంటి వందల ఆలయాలను పునరుద్ధరించారని, 300 సంవత్సరాల క్రితమే మహిళ సైనిక దళం నిర్మాణం చేసి మహిళలు ఎందులోనూ తక్కువకారని సమాజానికి గొప్ప సందేశం ఇచ్చారన్నారు. కుటుంబంలో ఉన్న వారంతా ఒక్కొక్కరుగా చనిపోయినా కంగుబాటుకు లోనూ కాకుండా తన మామ నుండి వచ్చినటువంటి రాజ్యాన్ని అందరి మన్నలు పొందే విధంగా పాలించారని, కుల, మత, వర్గ బేధం లేకుండా అందర్ని ఒకే సమూహంగా చూపారని, వీరి చరిత్ర అందరికే తెలియాలనే ఉద్దేశ్యంతో సామాజిక సమరసత వేదిక



## క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం

**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్ 07 :**విద్యార్థులు క్రీడలతోనే మానసిక ఉల్లాసాన్ని పొందుతారని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని ఆష్ట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయి లో అవార్డులను పొందడం గర్వించదగ్గ విషయం అన్నా రు. ప్రతి విద్యార్థి క్రీడల ద్వారా శారీరకంగా మానసికంగా ఉల్లాసం పొందుతారని ఆయన పేర్కొన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు దోహద పడతాయన్నారు. విజేతలైన విద్యార్థులకు అవార్డులను అందజేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.15 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన ప్రహరి గోడ, 20 లక్షల నిధులతో చేపట్టిన సిసి రోడ్డుకు భూమి పూజ చేశారు. అనంతరం గోదావరి తీరంలోనున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించారు. నెల రోజుల్లో రైతులకు సాగునీరు అందించాలని లేనియెడల కాంటాక్ట్ ను రద్దు చేస్తానని హెచ్చరించారు. అంతకుముందు సీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ జడ్పిటిసి నర్సగౌడ్, ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి స్థానిక నాయకులు మోహన్ రెడ్డి, ముత్యం రెడ్డి, రాములు, సుభాష్ రెడ్డి, సతీష్ రెడ్డి, కిషన్, తదితరులు పాల్గొన్నారు.



## దళితుల ఆర్థిక సావలంబన కోసం కృషి చేయడం లక్ష్యం



**గొల్లపెల్లి (మన వెలుగు) డిసెంబర్ 07 :**జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్, ఐఏఎస్. ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ,డిక్కీ దళిత్ ఇండియాన్ ఛాంబర్ అఫ్ కామర్స్ అండ్ ఇండ్రస్ట్ సంస్థ జగిత్యాల జిల్లా యొక్క సమన్వయకర్తగా నల్ల శామ్ ను నియమించడం జరిగింది. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ అనుమతి పత్రం ఇస్తూ వారితో సంభాషించడం జరిగింది. ఆ పత్రం స్వీకరించిన కలెక్టర్ బి సత్య ప్రసాద్. నల్ల శామ్ ను ప్రశంసించారు.మనిషి ఎదుగుదలలో ముఖ్య భాగమైన సాంఘిక, రాజకీయ, ఆర్థిక రంగాలలో ఒకటైన ఆర్థిక రంగంలో, డిక్కీ సంస్థ గత 20 సంవత్సరాలుగా పద్మశ్రీ మిలింద్ కాంబ్లి 2005 సంవత్సరంలో మహారా ష్ట్రలోని పూణే వేదికగా స్థాపించడం జరిగింది. ఆ తర్వాత ఐదు సంవత్సరాల తర్వాత, అనగా 2010లో పద్మశ్రీ రవి కుమార్ నర అప్పుడు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లోని ఈ సంస్థను పరిచయం చేయడం జరిగింది.అప్పటినుండి ఇప్పటివరకు అనేక కార్యక్రమాలను చేపట్టి విజయ వంతంగా దళితుల ఆర్థిక సావలంబన కోసం కృషి చేయడం జరిగింది. ముఖ్యంగా, దళితులను కేంద్ర బిందువుగా చేసుకొని ఈ సంస్థ అనేక కార్యక్రమాలు నిర్వహించి వాటిని విజయవంతంగా చేస్తోంది. కొన్ని ఉదాహరణలు చూపుతూ, దళితులకు ఎటువంటి ఆర్థిక సంస్థలు లేదా బ్యాంకుల నుండి ఖచ్చితమైన స్వావ లంబన అందకపోవడం వలన, డిక్కీ సంస్థ ప్రతిష్టాత్మ కమైన స్టాండప్ ఇండియా స్కీం ని తీసుకురావడం జరిగింది. దీని ద్వారా అనేక దళితులు మరియు అన్ని వర్గాల మహిళలు లక్షలాదిమందిగా లబ్ధి పొందారు.అదే విధంగా, కేంద్రంలోని అనేక ప్రభుత్వ సంస్థలలో దళితులు కాంట్రాక్ట్ చేసుకునేందుకు ఈ ప్రోక్యూర్మెంట్ పాలసీ కింద నాలుగు శాతం పొందడం జరిగింది. ఇప్పుడు మనం తెలంగాణలో అనుభవిస్తున్న టీప్రైడ్ కార్యక్రమం ద్వారా, తెలంగాణలోని దళితుల కాంట్రాక్టులో 15 శాతం పొందు తున్నారని ఎవరైనా అన్నారంటే, దీనికి కారణం డిక్కీ సంస్థ. ఇలాగే అనేక కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పని చేస్తూ, దళిత ఆర్థిక అభివృద్ధి ధ్యేయంగా, పద్మశ్రీ రవి కుమార్ నర ఆధ్వర్యంలో అనేక కొత్త పథకాలు దళిత యువతకు అన్ని విధాలుగా సహకారం అందిం చేలా ముందుకు సాగుతున్నాయి.ఇలాంటి గొప్ప సంస్థలో నేను సేవ చేయడానికి అవకాశం పొందడం నాకు ఎంతో సంతోషం. నన్ను నమ్మి ఇంత గొప్ప బాధ్యతను నా మీద ఉంచిన పద్మశ్రీ రవి కుమార్ నర, జాతీయ అధ్యక్షులు డిక్కీ, రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ దాసరి మేడమ్, రాష్ట్ర కోఆర్డినేటర్ నారాయణ దాసరి మరియు రాష్ట్ర ముఖ్య కార్యవర్గానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుకుం టున్నాను. మీ నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లో వమ్ము చేయకుండా, జిల్లాలోని అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ జిల్లా లోని దళితుల ఆర్థిక అభివృద్ధి కొరకు నా వంతు బాధ్యతను నిర్వర్తిస్తానని తెలియజేశారు

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం వివరాలను నమోదు చేయడం కీలకం

### ఎలాంటి పొరపాట్లకు తావివ్వద్దు.


### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ములుగు ప్రతినిధి( మన వెలుగు ) డిసెంబర్ 07 :**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అర్హులను గుర్తించడానికి ఇండ్ల స్థలాల వివరాల నమోదు కీలకమని, నమోదు సందర్భంగా ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వద్దని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ఇంచార్జ్ సంపత్ రావు తో కలిసి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, గ్రామ కార్యదర్శులకు పవర్ ప్రెజెంటేషన్ ద్వారా ఇందిరమ్మ ఇండ్ల పై జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఇండ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్ల వద్దకు వెళ్లి ఇంటి స్థలాన్ని పరిశీలించి ధ్రువీకరణ పత్రాలను, లబ్ధిదారుల ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ వివరాలను సేకరించాలని సూచించారు. లబ్ధిదారులు ఇండ్ల వద్ద లేని పక్షంలో వలస వెళ్లిన వారికి సెల్ ఫోన్ ద్వారా వివరాలను సేకరించాలని, వివరాల సేకరణను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని తెలిపారు. నిర్దేశించిన గడువు లోగా వివరాలను సేకరించాలని, ఎలాంటి తప్పులు లేకుండా పూర్తిచేయాలని అన్నారు. సేకరించిన వివరాలను వెంటనే ఆన్లైన్లో నమోదు చేయాలని, ఆన్లైన్లో నమోదు చేసే సమయం లో ఎలాంటి సమస్య తలెత్తిన సంబంధిత ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. గ్రామాలలో చేపట్టిన వివరాల సేకరణ పూర్తి సమాచారాన్ని ఎప్పటికి అప్పుడు జిల్లా అధికారులకు



తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో తహసీల్దార్లు, ఎంపీడీ వోలు, గ్రామ కార్యదర్శులు ఆయా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాసర గోదావరిలో వ్యక్తి మృతదేహం లభ్యం



**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్ 07 :**తానూర్ మండలానికి చెందిన శివానంద్ అనే వ్యక్తి బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివా రం స్థానిక గంగపుత్రులు, అటుగా వెళు తున్న ప్రయాణి కులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు గోదావరి బ్రిడ్జిపై చెప్పులను వదిలేసి నదిలో దూకారు. దీంతో ఎస్ఐ గణేష్ సంఘటన స్థలానికి చేరుకుని గంగపుత్రుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. ఈ మేరకు పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గత నాలుగు సంవత్సరాలుగా అనారోగ్య సమస్యతో బాధపడుతు న్నారని మృతుని అన్న మాధవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు.

## -అన్ని అంగన్వాడి కేంద్రాలకు మెటీరియల్ పంపిణి -కాంగ్రెస్ ఎమ్మెల్యే మేఘా రెడ్డి



**వనపర్తి ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 07 :**తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడీల బలోపేతానికి పెద్దపీట వేసిందని ఈ క్రమంలో వనపర్తి జిల్లా పరిధిలోని 364 అంగన్వాడి కేంద్రాలకు పాఠ్యపుస్తకాలు, టేబుల్స్, విద్యా ర్థులకు పాఠశాల దుస్తులు ఇలాంటి సమస్య లేకుండా ముందస్తుగానే అందజేసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వనపర్తి మండలం కందిరీగ తండాలో శనివారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి అంగన్వాడి మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు, దుస్తువులు పాఠ్యపుస్తకాలు కేంద్రానికి టేబుల్ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలను బలోపేతం చేస్తున్నామని గ్రామీణ స్థాయిలోనే జాతీయస్థాయి విద్యను అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని, ఈ కార్యచరణ ఫలితమే ప్రతి మండలంలో ఏర్పాటు చేసే ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్బులని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సిడిపిఓ హజీరా, వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ జెడ్పిటిసి గొల్ల వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ నాగరాజు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తకోటలో ద్వానించిన హరిహర సుతుడు అయ్యప్ప నామస్మరణ





**- అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మహా పడిపూజ**

**- భక్తి భావంతో కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ గ్రామ ప్రజలు**

**వనపర్తి ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 07 :**కొత్తకోట మండల కేంద్రంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శుబ్రహ్మణ్య షష్టి పురస్కరించుకుని ఏర్పాటుచేసిన మహా పడిపూజ కావడి సేవ కార్యక్రమం అంగరంగ వైభవంగా మహా ఆర్భాటంగా కొనసాగింది శ్రీశ్రీశ్రీ గోపాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టువంటి ఈ యొక్క మహా పడిపూజ కార్యక్రమం ఉదయం 4 గంటలకు గణపతి హోమంతో ప్రారంభించి స్థానిక అంబా భవాని ఆలయంలో స్వామివారికి అభిషేకించే కలశాలను , పాలతో నింపిన కావడులను పూజా కార్యక్రమాలు నిర్వహించి అక్కడి నుండి మేళ తాళాలు భాజా భజంత్రీలు కోలాటాలు బతుకమ్మలతో శోభాయాత్రగా శ్రీ భూతనాధ అయ్యప్ప అన్నదాన క్షేత్రానికి చేరుకొని అక్కడ గణపతి , సుబ్రహ్మణ్య స్వామి , హరిహర పుత్ర అయ్యప్ప స్వామి వారికి పంచామృతాలతో త్రిమూ ర్తులకు అష్టాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పలు చేసే నృత్యం ఆద్యంతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది కార్యక్రమంలో అయ్యప్ప సేవాసమితి అధ్య క్షులు ధూపం నాగరాజు కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు. శనివారం సాయంత్రం 6:30 గం'లకు మహా పడి పూజా కార్యక్రమం ఉంటుందని ఈ కార్యక్రమంలో పేరుసోముల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఉపాసకులు శ్రీశ్రీశ్రీ రాం మోహన్ స్వామి వారు , అంబత్రయ క్షేత్ర పీఠాధిప తులు శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామివారు రైచూర్ సాలిమఠ పీఠాధిపతి శ్రీ సూగురయ్య మహా స్వామి పాల్గొంటారని శ్రీ గోపాలకృష గురుస్వామి తెలిపారు. అన్నదాన కార్యక్రమా నికి దాతగా పాలెం మురళీధర్ రెడ్డి , అల్పాహార దాతగా విష్వమోహన చారి , సౌండ్ భజన బృందం దాతగా నాగరాజు గౌడ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవాసమితి అధ్యక్షులు ధూపం నాగరాజు , ప్రధాన కార్యదర్శి పొగాకు అనీల్ , కోశాధికారి విశ్వనాథం గంగాధర్ , ఉపాధ్యక్షులు లింగేశ్వర్ , అర్చకులు జోషి రవికాంత్ , జంగం నటరాజ్, గంగాధర్ , అనీల్ , గురు స్వాములు ఉమా మహేశ్వర రెడ్డి , కండే నరేష్ , రఘావేంద్ర చారి , మోహన్ రెడ్డి , కవీంధర్ రెడ్డి , మద్దిగట్ల బాలకృష్ణ , సత్యం సాగర్ , వేముల సుధాకర్ రెడ్డి , రాజశేఖర్ , భాస్కర్ రెడ్డి , రవి రెడ్డి , లక్ష్మీ నారాయణ యాదవ్ , జేసిబి భాస్కర్ , నరేష్ స్వామి , భాస్కర్ , రాజశేఖర్ , నితిన్ చారి , వేముల సంతోష్ , విశ్వనాథం సాయి భీమ కిషోర్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# శ్రీ సీతారాముల ఆలయ హుండీ లెక్కింపు



**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్ 07 :**ముధోల్ మండలం అష్టా గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరామాలయం హుండీ లెక్కింపు చేపట్టామని శ్రీరామాల య కమిటీ చైర్మన్ ఆర్మూర్ సంతోష్ రెడ్డి తెలిపారు. శ్రీరామ చంద్రుడి ఆలయంలో శనివారం హుండీ లెక్కింపులో 24,163 రూపాయలు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఒక్కరోజు భక్తులు హుండీలో వేశారని పేర్కొన్నారు. ఆలయ లెక్కింపులో కమిటీ చైర్మన్ సంతోష్ రెడ్డి, వైస్ చైర్మన్ నల్ల సుకన్య రమేష్, ఆలయ కమిటీ సభ్యులు, విడిసి సభ్యులు పాల్గొన్నారు. అనంతరం విశ్వకర్మ సంఘ అధ్యక్షులు శ్రీనివాస్, సంఘ సభ్యులు రామాలయ కమిటీ చైర్మన్ సంతోష్ రెడ్డి కి, రామాలయ కమిటీ సభ్యులను సన్మానించారు. అనంతరం మహానంద సరస్వతి స్వామి వారి శిలాఫలక ఆవిష్కరణ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ అష్టా గ్రామ రామాలయం నియోజకవర్గంలో మహా పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మూడు రోజులపాటు నిర్వహించిన ప్రాణ ప్రతిష్ట ఉత్స వాలను విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ రామచంద్రుని ఆశీస్సు లతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రావుల శ్రీనివాస్, రావుల పోశట్టి, మాజీ ఎంపీటీసీ సునీత పోశట్టి, అశోక్, బొంగు సాయిలు, సూర్గు ల శ్రీనివాస్, మిద్దె సాయిలు, బాలాగారి ముత్యం, శంబు భోజనం పెంటన్న, గురు స్వామి సునీల్, శివ ప్రసాద్, గంగా ప్రసాద్, చిన్నబ్రహ్మం ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి ఆకస్మిక మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే

**- హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి చేరుకున్న కుటుంబ సభ్యులు**

**- పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడి మృతికి గల కారణాలను తెలుసుకున్న ఎమ్మెల్యే**



**వనపర్తి ప్రతినిధి (మనవెలుగు) డిసెంబర్ 07 :**పెద్దమందడి మండలం బలిజపల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో ఆటలాడుతూ అస్వస్థతకు గురై మృతి చెందిన విద్యార్థి సాయి పుతిన్ కుటుంబ సభ్యులను శనివారం సాయంత్రం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. పెద్దమందడి మండలం బలిజపల్లి- జంగమయ్యపల్లి జంట గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువు తున్న సాయి పుత్తిన్ అనే విద్యార్థి పాఠశాలలో నిర్వహిం చిన ఆట పోటీలలో పాల్గొని ఆటలాడుతూ అస్వస్థతకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు తమ కుమారుడు అస్వస్థకు గురయ్యాడని ముందరి తండా కు చెందిన తల్లిదండ్రులు నీలమ్మ, రవి కి సమాచా రం అందించారు. విషయం తెలుసుకున్న తల్లి నీలమ్మ వెంటనే పాఠశాలకు వెళ్లి తన కుమారుడితో మాట్లాడి తనకు ఏం కాలేదని ఆట ఆడిన సమయంలో కాస్త కళ్ళు తిరిగినట్లుగా ఉందని ఇప్పుడు బాగానే ఉన్నానని కుమా రుడు తల్లితో చెప్పి నువ్వు ఇంటికి వెళ్ళు అనడంతో తల్లిని తిరిగి ఇంటికి వెళ్ళిపోయింది. అనంతరం విద్యార్థు లు కలిసి భోజనం చేసిన సాయి పుతిన్ మళ్లీ తోటి విద్యార్థులు కలిసి ఆడుతున్న క్రమంలో ఒక్కసారిగా కళ్ళు తిరిగి కింద పడిపోయాడు. దాంతో అక్కడి ఉపాధ్యా యులు హుటాహుటిన విద్యార్థిని వనపర్తి జిల్లా ఆసుప త్రికి తరలించారు. ఆసుపత్రిలో విద్యార్థికి వైద్య పరీక్షలు చేసిన వైద్యులు అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు వివరించారు. వివరాలు తెలుసుకున్న ఎమ్మె ల్యే అధికారులు ఆర్డిఓ, ఎమ్మార్వో, ఎస్ఐ, డిఎన్హెచ్ఓ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థి మృతిపట్ల పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలబ డేలా తగు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వారికి ఆదేశాలు జారీ చేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల నిర్ణయం ప్రకారమే తుది నిర్ణయం తీసుకోబడుతుందని ఇందులో ఎవరి బలవంతపు నిర్ణయాలు ఉండకూడదని మీరు మీ నిర్ణయాన్ని స్వేచ్ఛగా చెప్పవచ్చునని ఎమ్మెల్యే వారికి సూచించారు. మీకు ఎలాంటి సమస్య ఉన్న 24 గంటలు నేను అందుబాటులో ఉంటానని కుటుంబానికి సైతం అన్ని విధాల తోడ్పాటు అందిస్తానని ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు.

# నేత పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వ మద్దతు






**-వేములవాడ మార్కెట్ యార్డ్ లో యారన్ డిపో ప్రారంభం**

**-హాజరైన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్**

**రాజన్న సిరిసిల్ల (మన వెలుగు) డిసెంబర్ 07 :**నేత పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతు అందజేస్తున్నదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 కోట్లు మంజూరు చేయగా, వేములవాడ మార్కెట్ యార్డ్ లో యారన్ డిపోను ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవలలో భాగంగా నేడు యారన్ డిపో ను ప్రారంభించుకోవడం శుభపరిణామని పేర్కొన్నారు. యారన్ డిపో లో 12 మంది సిబ్బందిని నియమించామని తెలిపారు. నేటి నుండి పూర్తి స్థాయిలో యారన్ డిపో అందుబాటులో కి వస్తుందని వివరించారు. రాబోవు రోజుల్లో వేములవాడ, సిరిసిల్ల లను జంట నగరాల్లగా అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. నేతన్నతల 30 సంవత్సరం కల నూలు డిపోను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. నూలు డిపో ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ సహకారం ఎంతో ఉందని గుర్తు చేశారు. సిరిసిల్ల నేతన్నల కొరకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు తీసుకొని ముందుకు పోతుందని స్పష్టం చేశారు. సంవత్సరం కాలంలో చేనేత జౌళి శాఖ ద్వారా నేతన్నలకు 375 కోట్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం నేతన్నలకు పెట్టిన బకాయిలను చెల్లించలేదని విమర్శించారు. తాము నేతన్నలకు భరోసా కల్పిస్తున్న మని వివరించారు. చేనేత క్లస్టర్ గా ఉన్న వేములవాడ కు యారన్ డిపో వస్తే కొంత మంది ఓర్వలేక పోతున్నారని, గతంలో 1000 కిలోమీటర్లు దూరం నుంచి వస్తే చూస్తూ ఉన్నవారు నేడు 10 కిలోమీటర్లు దూరం నుండి దారం వస్తే తట్టుకోలేక పోతున్నారని పేర్కొన్నారు. టెస్కో ద్వారా 90 శాతం క్రెడిట్ పై నూలు ఇస్తున్నామని వెల్లడించారు. సిరిసిల్ల నేతన్నలకి బహిరంగ మార్కెట్ లో ఉన్న రెట్ పై యారన్ ఇస్తామని ప్రకటించారు. గత పాలకుల హయాం లో బతుకమ్మ చీరాల పేరిట నేతన్నల బతుకులు ఆగం చేసారని, మన ప్రాంతంలోని పాలిస్టర్, కాటన్ పరిశ్రమను నిలువునా ముంచారని విమర్శించారు. చేనేత కార్మికులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మన సిరిసిల్ల బ్రాండ్ ఇమేజ్ పెంచేలా కృషి చేయాలని నేత కార్మికులకు పిలుపు ఇచ్చారు. యారన్ డిపో ను రూ.50 కోట్ల నుండి 100 కోట్లకు పెంచేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# శ్రీ హేమాచలంలో జిల్లా అడిషినల్ కలెక్టర్



**ములుగు ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 07 :**తెలంగాణ లో యాదగిరి గుట్ట తర్వాత రెండవ యాదగిరి గుట్టగా పిలువబడే మల్లూరు గుట్టపైన స్వయంబుగా వెలసిన శ్రీ హేమచల శ్రీ లక్ష్మి నృసింహ స్వామి ఆలయా నికి ములుగు జిల్లా అడిషినల్ కలెక్టర్ మహేందర్ జి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు ముందుగా చింతామణి జలపాతం సందర్శించి అలయము వద్దకు వెళ్లగా సంప్రాదయం ప్రకారం అలయ అర్చకులు స్వాగ తం పలికారు అనంతరం గర్భలయంలో స్వామి వారికి వారిపేరు మీద అభిషేకం అర్చనలు నిర్వహించారు స్వామి వారి విశిష్ఠత గుడి పురాణం వివరించి ఆశీర్వ చనం చేసి తీర్థప్రసాదాలు శేష వస్త్రాలు ములుగు జిల్లా అడిషినల్ కలెక్టర్ మహేందర్ జి కి అందజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కైంకర్యం రాఘవచార్యులు అర్చకులు ఈశ్వర్ చంద్ శర్మ మండల డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్ అర్ఐ శ్రీనివాస్ అలయ సిబ్బంది పాల్గోన్నారు.

# ఆర్టీసీ ఏసి బస్సుల చార్జీలో రాయితీ



**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 07 :**టిజిఎస్ ఆర్టిసి ఎస్ సి బస్సుల చార్జీలో రాయితీని ప్రయా ణికులకు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి శనివారం తెలిపారు ఈ నెల 31 వరకు ఏసి బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు టికెట్ పై 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు నిర్మల్ నుంచి జేబీఎస్ హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్ వెళ్లే ఏసి బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు బస్సు టికెట్లో రాయితీ ఉంటుందని పేర్కొన్నారు.

# సీఎం కప్ క్రీడా పోటీల ఏర్పాటు పరిశీలన



**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 07 :**జిల్లా కేంద్రంలో నిర్వహించే మున్సిపల్ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సి పల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు శనివారం స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు పరిశీలించారు 10, 11, 12 తేదీల్లో మూడో రోజులు పాటు సీఎం కప్ టోర్నమెం ట్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఇందులో డిఈ హరి భువన్, పిడి భూమన్న, సెంటర్ ఇన్స్ట్రక్టర్ దేవదాస్ తదితరులు ఉన్నారు.

# చిన్నారులకు తప్పకుండా టీకాలు వేయించాలి



**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 07 :**చిన్నారులకు తప్పకుండా టీకాలు వేయించాలి ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది సూచించారు శనివారం ఖానాపూర్ మండలంలోని గోడల పంపు రంగాపేట్ గ్రామాలలో ఉన్న అంగన్వాడి కేంద్రాలల్లో చిన్నారుల కోసం వ్యాక్సి నేషన్ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు వారు టీకాలు వేశారు టీకాలు చిన్నారులకు శ్రీరామరక్షని , పలు వ్యాధుల నుండి కాపాడతాయని వారన్నారు ఈ కార్యక్రమం లో ప్రభుత్వ వైద్య సిబ్బంది ఉన్నారు.

# సంపూర్ణంగా ఆటోలు బంద్



**ములుగు ప్రతినిధి ( మన వెలుగు) డిసెంబర్ 07 :**తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేసిన విషయం అందరికి తెలిసిందే రాష్టంలో మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటో నడుపుకొని కుటుంబాన్ని కొనసాగిస్తున్న పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన ఆటో డ్రైవర్ల జీవితం అర్ధరాయిధం అయింది ఆటో నమ్ముకొని బ్రతుకుదామని అప్పులు ఫైనాన్సులు చేసి ఆటో కొనుక్కుంటే మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్ల జీవితం అగోమ్య చరంగా మారింది ప్రభుత్వం పై నిరసనగా డిసెంబర్ 7 న తెలంగాణ ఆటో యూనియన్ జేఏసీ పిలుపుమేరకు వారికి మద్దతుగా మండలంలోని మంగపేట కమలాపురం, మల్లూరు, రాజుపేట, తిమ్మంపేట, కోమటిపల్లి, నరసింహసాగర్ శ్రీ చైతన్య ఆటో యూనియన్ సభ్యులు వారికి మద్దతు తెలుపుతూ స్వచ్చందంగా ఆటోలు నిలిపివేసి రాష్ట్ర వ్యాప్త బందుకు సంపూర్ణ మద్దతు ప్రకటించి ఆటోలు బంద్ చేసి విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ లు పాల్గొన్నారు.

ఎడిటోరియల్


# ఎక్కువ మంది పిల్లల్ని కనమంటే సరా



'దేశంలో ప్రతీ కుటుంబం ముగ్గురు పిల్లల్ని కనాలం'టూ నేతలు ఇటీవల పిలుపునిస్తున్నారు. తగ్గుతున్న జనాభాకి ఇదే సరైన పరిష్కారమట! ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా కొన్ని నెలల క్రితం పిలుపునిచ్చారు. అయితే ఇది మన దేశానికి మాత్రమే పరిమితమైన సమస్య కాదు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో వుంది. చైనా, రష్యా, జపాన్‌ది కూడా ఇదే దారి.

మన దేశం వరకూ చూస్తే మనది ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం. నూట నలభై కోట్ల జనాభా. జనాభాలో అధిక శాతం యువత. కాబట్టి ప్రపంచంలో శక్తివంతమైన ఆర్థిక దేశంగా తయారయ్యే అవకాశాలున్నాయి. అయితే ఈ అనుకూలత ఎంతో కాలం ఉండదు. ఇప్పుడే ఒడిసిపట్టాలి. ఇంకొన్నాళ్లు పోతే అత్యధిక వృద్ధుల సంఖ్య ఉన్న దేశంగా మారబోతోంది. అప్పుడు పని చేసే వారి కన్నా, ఆసరా అవసరమైన వాళ్లే ఎక్కువ అవుతారు. వారి కోసం సామాజిక బీమా, ఉచిత వైద్య సదుపాయాలు లాంటివి ఎక్కువ అవసరం పడి ఖజానాకు రాబడి కన్నా ఖర్చు ఎక్కువ అవుతుంది. అందుకు తగినట్టు ఆర్థిక స్థితి పెంచుకోవాల్సి ఉంటుంది. మరోవైపు చూస్తే ప్రస్తుతం సంపూర్ణ సంతాన సాఫల్య రేటు (ఫెర్టిలిటీ రేటు) 2.2 నుండి 2 కి తగ్గింది. ఇది మంచి ట్రెండ్ కాదు. కనీసం 2.1 ఉంటే జనాభా స్థిరీకరణ ఉంటుంది. అంటే ఒక మహిళ ఇద్దరి కన్నా ఎక్కువ మంది (ముగ్గురు) ని కంటేనే ఇప్పుడున్న జనాభా ఇక ముందు ఇలాగే కొనసాగుతుంది. లేదంటే తక్కువకు నియంత్రించబడుతుంది. ఫెర్టిలిటీ రేటు తగ్గుదలని ఇలాగే కొనసాగనిస్తే దేశం 2050 సంవత్సరం నాటికి 1.2 కి చేరుతుందని అంచనా. ప్రస్తుతం దక్షిణ కొరియా ఇలాంటి ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ప్రభుత్వమైనా, సామాజిక నాయకత్వమైనా ఎక్కువ మంది పిల్లల్ని కనండి అని పిలుపునిస్తే సరిపోదు. తక్కువ మంది పిల్లల్తో సరిపెట్టడానికి కారణం ఆర్థిక శక్తి లేకపోవడం, ఉద్యోగాలు, ఉపాధి వేటలో పడి పిల్లల్ని సాకే సమయం లేక వద్దనుకోవడం, వారు ఎదగడానికి వనరులు కొరత ఉండడం లాంటివి చాలా ఉన్నాయి. కాబట్టి పిల్లల్ని పెంచడం భారం కాదనిపించేలా ప్రభుత్వ విధానాలు ఉండాలి. ఉచిత విద్య, వైద్యం, పౌష్టికాహార పంపిణీ, శిశు, మహిళా రక్షణ కార్యక్రమాలు, ప్రోత్సాహకాలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. అప్పుడే అధిక సంతానం వైపు. తద్వారా సంపద వైపు భావి భారతం వడి వడిగా అడుగులు వేస్తుంది. లేదంటే వృద్ధ భారతమై భారంగా అడుగులు వేస్తుంది. ఇది నిర్ణయాత్మక మలుపు.

# మతతత్వ విభజన రాజకీయాలొద్దు



బంగ్లాదేశ్‌లో హిందువులపైనా, బౌద్ధులు తదితర ఇతర మైనారిటీలపైన నిరంతరాయంగా సాగుతున్న దాడులు ఎంతో ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజా వెల్లువ కారణంగా ఆగష్టు నెల మొదటి వారంలో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత ఆమె నిరంకుశ పాలన ముగిసింది గనక బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామిక వ్యవస్థ ఉదయిస్తుందని ఆశించారు. కాని మొదటి రోజులలో కల్లోలం హిందూ దేవాలయాలపై దాడులు దేశవ్యాపితంగా మైనారిటీలపై దాడుల వార్తలు వచ్చాయి. తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుడుగా వున్న మహ్మద్ యూనస్ ఆ సమయంలో మైనార్టీలకు రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ అప్పటి నుంచి ఆ సంఘటనలు సాగుతూనే వున్నాయి. ఇప్పటికి చూస్తే మొత్తం 2000 హింసా ఘటనలు ఆధారాలతో సహా నమోదైనాయి. మైనార్టీ వర్గాలకు చెందిన తొమ్మిది మంది వరకూ చంపబడ్డారు

చిన్మయ కృష్ణదాస్ అనే హిందూ సన్యాసి అరెస్టు దేశద్రోహ నేరం బనాయింపు జరిగాక ఈ దఫా పరిస్థితి మరింత క్లిష్టతరమైంది. ఇదివరలో హరేకృష్ణ ఉద్యమం ఇస్కాన్‌తో ముడిపడివున్న ఈయన దాని నుంచి తొలగించబడి సమ్మిళిత సనాతని జాగరణ్ జోతే అనే సంస్థతో పనిచేస్తున్నారు. ఆయన తీవ్రమైన భావాలు వెలిబుచ్చిన మాట నిజమే అయినా బంగ్లాదేశ్ జాతీయ పతాకాన్ని కించపర్చిన కారణంగా అరెస్టు చేసి దేశ ద్రోహం ఆరోపణలు బనాయించడం అధికార దుర్వినియోగంతో చేసిన పని మాత్రమే. దాస్‌ను కోర్టులో హాజరుపర్చినప్పుడు బెయిలు లభించకపోవడంతో పోలీసులకు, ఆయన అనుయాయులకు మధ్య ఘర్షణ జరిగింది. ఒక అసిస్టెంటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దాడికి గురై మరణించారు. ప్రస్తుతం మత పరిస్థితి ఎంత ప్రమాదకరంగా వుందో దీన్ని బట్టే తెలుస్తుంది.

తాత్కాలిక ప్రభుత్వం దాని ప్రతినిధులు ఈ దాడుల ఘటనలను తేలిగ్గా తీసేయజూస్తున్నారు. ఇవన్నీ అతిశయోక్తిగా చెబుతున్నవని కొట్టి పారేస్తున్నారు. అవామీ లీగ్ కార్యకర్తలపైన, వారి మద్దతుదారులపైన ప్రజాగ్రహం ఫలితమే ఇవన్నీ అన్నట్టు చిత్రిస్తున్నారు. బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా సాగుతున్న ఈ ప్రచారం వెనక భారత ప్రభుత్వ హస్తం వుందన్నట్టు మాట్లాడుతున్నారు. మైనారిటీలపై ఇస్లామిక్ శక్తులు ఈ దాడులకు పాల్పడుతున్నాయనే వాస్తవాన్ని విస్మరించడం ద్వారా యూనస్ నాయకత్వంలోని ప్రభుత్వం తప్పు చేస్తున్నది. షేక్ హసీనా ప్రభుత్వానికి మోడీ సర్కారు మద్దతునివ్వడం వల్ల నెలకొన్న భారత వ్యతిరేక భావనను మైనార్టీలపై దాడికి ఒక కవచంగా ఇస్లామిక్ చాందస శక్తులు ఉపయోగించు కుంటున్నాయి. జమాతే ఇస్లామీపై నిషేధం తొలగించడం, దాని నాయకులు జైళ్ల నుంచి బయటికి రావడంతో హిఫాజాతె ఇస్లాం వంటి మత చాందస సంస్థలు హిందువులను లక్ష్యంగా దాడులు చేయడానికి మత విభజన తీసుకురావడానికి పూర్తి స్వేచ్ఛ లభించింది. షేక్ హసీనా పాలన కాలంలో కూడా ఇలాంటి చాందస శక్తులు మైనార్టీలపై దాడులకు పాల్పడుతూనే వున్నారు. తమ ఒంటెత్తు విధానాలు రుద్దడానికి ఇదే సరైన సమయంగా భావిస్తున్న ఇలాంటి శక్తులను కఠినంగా అణచి వేయడం అవసరం. బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం, ప్రజాస్వామిక శక్తులు కూడా ఈ సమయంలో నిలదొక్కుకోవడం అవసరం.

ఈ పరిస్థితిలో భారత దేశంలో బిజెపి ఆర్ఎస్ఎస్ ఇంకా అనేక ఇతర హిందూత్వ సంస్థల ధోరణి ఈ సమస్య పరిష్కార కృషికి సహాయపడేదిగా లేదు. హిందువుల దుస్థితి అంటూ ఈ సంస్థలు సరిహద్దు పొడుగునా విశృంఖలంగా రెచ్చగొట్టే ప్రచారం సాగిస్తున్నాయి. నూతనంగా ఏర్పడిన తమ రాజకీయ వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నంగా అక్కడ బంగ్లాదేశ్‌లో అధికారులు, ప్రజాస్వామిక శక్తులు పరిగణిస్తున్నాయి. కోల్‌కతా, అగర్తలా, గౌహతిలలో బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాల ముందు కవ్వింపు భాషతో హిందూ తీవ్రవాద బృందాలు ప్రదర్శనలు జరపడం పరిస్థితి మరింత దిగజారడానికి కారణమైంది. అగర్తలాలో బంగ్లాదేశ్ సహాయ హైకమిషనర్ కార్యాలయ ఆవరణలోకి చచ్చుకు వెళ్లి ఆస్తుల విధ్వంసానికి పాల్పడటం ఆ దేశంలో భారత వ్యతిరేకతను మరింత ముదిరిపోయేలా చేయడానికే కారణమవుతుంది. బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా తీవ్ర భాషలో దండకం చదవడం అక్కడ మైనార్టీల భద్రతకు ముప్పుగా తయారవుతుంది.

భారత దేశంలో మైనారిటీలపై వేధింపులు, విద్వేష ప్రచారం సాగించే పాలకులు అదే మైనారిటీల రక్షణ గురించి నీతి బోధ చేస్తుంటే బంగ్లాదేశ్ ప్రజలు విస్తుపోతున్నారు. అగ్రశ్రేణి భారతీయ నేతలు, బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా తీవ్ర భాషలో పల్లవి ఆలపిస్తున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జార[illegible]ండ్‌లో ఎన్నికల ప్రచారంలో బంగ్లాదేశీయుల భారీ చొరబాటును గురించి అసత్యపూరితంగా తీవ్ర హెచ్చరికలు చేశారు. గతంలో ఆ చొరబాటుదారులనే 'దేశ దిమ్మరులు' అని ఆయన మాట్లాడారు.

మతతత్వ విభజన రాజకీయాలు ఇరు దేశాల ప్రయోజనాలకు నష్టదాయకంగా పరిణమిస్తాయని ఉభయ దేశాలలోని లౌకిక, ప్రజాస్వామిక శక్తులు నొక్కి చెప్పడం అవసరం. బంగ్లాదేశ్‌లో మైనారిటీల భద్రతను కాపాడటం కోసం, పౌరులుగా వారి హక్కులను పూర్తిగా రక్షించడం కోసం గట్టిగా నిలవాల్సిన బాధ్యత షేక్ హసీనా నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన లౌకిక, ప్రజాస్వామిక శక్తులపై వుంది.

# నిగ్గు తేల్చిన నివేదిక



సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఇటీవల సమర్పించిన మధ్యంతర నివేదిక దేశంలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభాన్ని కళ్ళకు కట్టినట్టు చూపింది. సమస్యల వలయంలో చిక్కుకున్న అన్నదాతలు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యల బాట పడుతున్న తీరును సోదాహరణంగా ఈ నివేదిక వివరించింది. అన్నదాతలే ఈసురోమంటుంటే వారి మీద ఆధారపడ్డ వ్యవసాయ కార్మికుల కుటుంబాల పరిస్థితి ఎలా బావుంటుందని ప్రశ్నించింది. దేశ వ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కార్మికుల బలవన్మరణాలు పెరిగిపోతుండటానికి ఇదొక ముఖ్య కారణమని ఆ నివేదిక కుండ బద్దలు కొట్టింది. ఈ పరిస్థితిని తక్షణమే మార్చాలని పేర్కొనడంతో పాటు, దానికి అవసరమైన కనీస చర్యలనూ సూచించింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతో పాటు, దేశ వ్యాప్తంగా తక్షణమే రైతులకు రుణమాఫీ అమలు చేయడం ఈ కమిటీ చేసిన సూచనల్లో అత్యంత కీలకమైనవి. వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను మెరుగుపరచడం, సేంద్రీయ వ్యవసాయాన్ని, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడంతో పాటు వ్యవసాయ కార్మికుల పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఉపాధిహామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని చెప్పింది. ఇంత కీలకమైన ఈ సిఫార్సులకు మీడియాలో పెద్దగా ప్రాధాన్యత లభించకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. గత నెల రెండవ తేదీన పంజాబ్-హర్యానా హైకోర్టుకు చెందిన రిటైర్డ్ న్యాయమూర్తి నవాబ్‌సింగ్ అధ్యక్షతన ఈ ఉన్నత స్థాయి కమిటీని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. వ్యవసాయ రంగాన్ని అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరగా నివేదికను సమర్పించాలని ఈ కమిటీని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. సుప్రీం ఆదేశాల మేరకు పక్షం రోజుల్లోనే ప్రాథమిక పరిశీలనను పూర్తిచేసిన ఈ కమిటీ నవంబర్ 21వ తేదీన మధ్యంతర నివేదికను సమర్పించింది. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన మూడు దశాబ్దాల దేశ వ్యాప్త నివేదికలు, గణాంకాలను ఈ కమిటీ పరిశీలించింది.

పంజాబ్-హర్యానా రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి రూపొందించిన ఈ నివేదికలో అనేక దిగ్భ్రాంతికర విషయాలను పేర్కొంది. ముప్పయి సంవత్సరాలలో దేశ వ్యాప్తంగా నాలుగు లక్షల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నట్లు ఈ కమిటీ తేల్చింది. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో డేటా ఆధారంగా ఈ నిర్ధారణకు కమిటీ వచ్చింది. ఇవి అధికారిక లెక్కలే కావడంతో వాస్తవంలో ఈ బలవన్మరణాలు మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వ్యవసాయం మీదనే ఆధారపడిన రైతులు రోజుకు 27 రూపాయలు మాత్రమే సంపాదిస్తున్నట్లు కమిటీ తేల్చింది. జాతీయ సర్వేతో పాటు నాబార్డు నివేదికలు, గ్రామీణ భారతంలోని వ్యవసాయ కమతాలు, పశుసంపదకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ రికార్డులను పరిశీలించి రైతుల ఆదాయంపై ఈ నిర్ధారణకు వచ్చిన కమిటీ 'ఇంత తక్కువ ఆదాయంతో జీవనాన్ని కొనసాగించడం అసాధ్యం. ఇదే వారిని ఆత్మహత్యల వైపు నడిపిస్తోంది' అని పేర్కొంది. దేశ వ్యాప్తంగా ఉన్న మొత్తం కార్మికుల్లో 46 శాతం మంది ఇప్పటికీ వ్యవసాయం మీదనే ఆధారపడి ఉన్నారని, ఆదాయంలో వారి వాటా కేవలం 15 శాతమేనని తెలిపింది.

వ్యవసాయ కార్మిక కుటుంబాల్లో నిరుద్యోగులుగా ఉన్న వారు, జీతం లేకుండానే కుటుంబం తరపున రెక్కలు ముక్కలు చేసుకుంటున్న వారి సంఖ్య కూడా గణనీయంగానే ఉందని కమిటీ పేర్కొనడం గమనార్హం. ఇది ఏదో రూపంలో కొనసాగుతున్న వెట్టిచాకిరీకి నిదర్శనం.తమ సమస్యల పరిష్కారం కోసం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతాంగం దేశ వ్యాప్త ఆందోళనకు తిరిగి సిద్ధమౌతున్న నేపథ్యంలో ఈ నివేదిక వెలువడటం ప్రాధాన్యత నంతరించుకుంది. కొన్ని సంవత్సరాలుగా రైతాంగం ఏదైతే చెబుతుందో దాదాపుగా అవే అంశాలు అంతే తీవ్రతతో ఈ నివేదికలోనూ కనిపించడం క్షేత్రస్థాయిలో నెలకొన్న దుస్థితికి దర్పణం పడుతోంది. కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణం రైతుల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాలి. సుప్రీంకోర్టు ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసిన, రైతాంగం ఎప్పటి నుండో డిమాండ్ చేస్తున్న కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, రుణ మాఫీ వంటి చర్యలకు తక్షణం శ్రీకారం చుట్టాలి. లేని పక్షంలో అన్నదాతలకు అండగా అఖిల భారతావని ఉద్యమించక తప్పదు.